క్లుప్తంగా

పట్టణంలో ప్లాంటేషన్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: మిషన్ ప్లాంటేషన్ 1 మిలియన్ కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ప్లాంటేషన్ ర్యాలీ నిర్వహించారు. మొక్కల ప్రాముఖ్యతను వివరించే ప్లకార్డులతో విద్యార్థులు పట్టణంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ అహ్మద్ ఖాన్, యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ నాయకుడు మొహమ్మద్ ముజాహిద్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాలలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ లోకేశ్

మల్యాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో 250మందికి డాక్టర్ లోకేశ్, డాక్టర్ హర్షిత్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా బీపీ, షుగర్ ఈసీజీ, 2డీ ఇకో పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి కిరణ్‌కుమార్,కోట కరుణాకర్,దాసరి చంద్రశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

జ్యూట్ బ్యాగుల పంపిణీ


జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న సభ్యులు

ధర్మపురి : ప్రపంచ పేపర్ బ్యాగ్ దినోత్సవం సందర్భంగా శనివారం జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ధర్మపురి పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రపంచ పేపర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పెన్న శ్రీనివాస్ దుకాణం వద్ద సుమారు 100 మందికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వద్దు కాగితం ముద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడాల రవీందర్, కార్యదర్శి సర్జారావ్, కోశాధికారి పప్పుల శ్రీనివాస్, రంగ హరినాథ్, వొజ్జల మోహన్, కట్ట శ్రీహరి తదితరులున్నారు.

కేజీబీవీలో కమిటీల ఏర్పాటు


ఎన్నికైన కమిటీ సభ్యులు

సారంగాపూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం వివిధ విభాగాలకు విద్యార్థినులు కమిటీలను ఎన్నుకున్నారు. విద్యాలయంలోని విద్యార్థులు ఓట్లు వేసి క్రమశిక్షణా కమిటీ, ఆరోగ్య కమిటీ, పరిశుభ్రత, సాంస్కృతి విభాగం కమిటీ, ప్రార్థనా కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ వీణా మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, పరిపాలన అంశాలపై అవగాహన కల్పించేందుకు కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని 36వ వార్డుకు చెందిన రేవెల్ల రవీందర్‌గౌడ్ ఇటీవల ఇజ్రాయిల్ దేశంలో గుండెపోటుతో మరణించగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ రమణ పరామర్శించి వారికి రూ.10 వేల ఆర్థికసాయం సైతం అందించారు. అలాగే టీఆర్‌నగర్‌కు చెందిన కృష్ణమూర్తి అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, వారి కుటుంబాన్ని సైతం పరామర్శించారు.

జవహర్ నవోదయకు 8 మంది విద్యార్థుల ఎంపిక

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి శ్రీరామ హైస్కూల్‌కు చెందిన 8 మంది విద్యార్థులు నూతనంగా కోరుట్ల జవహర్ నవోదయ విద్యాలయంలో సీటు సాధించారు. పాఠశాలకు చెందిన హరన్‌తేజ్, అవినాష్, మనివర్షిత్, పి. సృజన్, శృతి, రమ, శన్విత, లక్ష్మీనేహ నవోదయకు ఎంపికయ్యారు.

నెరవేరిన దశాబ్దాల కల

- రామారావుపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- తీరనున్న వాహనాల దారుల పాట్లు


బ్రిడ్జిపై నుంచి ప్రారంభమవుతున్న రాకపోకలు

రాయికల్: మండలంలోని రామారావుపల్లి–ఇటిక్యాల పెద్ద వాగుపై రూ.9 కోట్ల నిధులతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయి ప్రజల కష్టాలు తీరనున్నాయి. మండలంలోని మారుమూల గ్రామం రామారావుపల్లిలో రూ.530 జనాభా ఉండగా, గ్రామంలో నిత్యావసర వస్తువులు, ఇతర అవసరాల కోసం ఇటిక్యాల గ్రామానికి రావాలన్నా సుమారు 10 కి.మీ వరకు తిరిగి రావాల్సి వచ్చేది.

తీరనున్న అవస్థలు

రామారావుపల్లిలో వాగుపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో రామారావుపల్లి ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఇటిక్యాల గ్రామానికి రావాలంటే కేవలం బ్రిడ్జి దాటితేనే అవకాశం ఉండేది. రాయికల్‌కు తక్కువ సమయంలో వచ్చే అవకాశం ఉంది. దీని కోసం ఇటిక్యాల–రామారావుపల్లి గ్రామాల మధ్య నున్న పెద్ద వాగుపై వంతెన నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బ్రిడ్జి పైనుంచి రాకపోకలు సాగే అవకాశం ఉంది.

బ్రిడ్జి నిర్మాణంతో అందరికీ మేలు



మా గ్రామంలో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణంతో రాయికల్‌కు రావాలంటే కేవలం 10 నిమిషాల్లో వచ్చే అవకాశం ఉంది. బ్రిడ్జి లేకపోవడంతో గతంలో రాయికల్‌కు రావాలంటే మల్లాపూర్ మండలం రేగుంట, రాయికల్ మండలం ఇటిక్యాల మీదుగా రాయికల్ వస్తున్నాం. దూరభారం ఉండేది. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మా ఇబ్బందులు తీరుతాయి.

– తొట్ల మహేశ్, రామారావుపల్లి

హామీ నెరవేర్చా



మొదటిసారిగా శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలిచాను. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. రెండోసారి ఎమ్మెల్యే అయిన సమయంలో నా చేతుల మీదుగానే శంకుస్థాపన జరగడంతో పాటు త్వరలోనే బ్రిడ్జి ప్రారంభిస్తాం.

సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే

బీసీలకు రిజర్వేషన్లు హర్షణీయం


స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం హర్షణీయమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణంలో శనివారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖుత్బుద్దీన్‌పాషా, అందె మారుతి తదితరులున్నారు.

బీసీలకు రిజర్వేషన్ అభినందనీయం

జగిత్యాల: ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ జారీకి క్యాబినెట్ ఆమోదం పొందడం అభినందనీయమని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ చేయడం ఎంతో అభినందనీయమని, 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 246 డీ6, టీ6 ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందన్నారు. నాయకులు లక్ష్మణ్, భాస్కర్, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

మల్యాల: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మల్యాల మండల కేంద్రంలో మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తో బీసీలకు విద్య,ఉద్యోగాలతోపాటు రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జంగిలి హన్మంతు, మర్రిపెల్లి రాజేశం, బీవీ రమణ, మ్యాక లక్ష్మణ్, చెవుల మద్ది శ్రీనివాస్, గంగారెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో చదువుకోవాలి


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: విద్యార్థులందరూ పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకి ఆవాసంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్ మనుమరాలు సమీర పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులందరికీ స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం ప్రతీ ఒక్కరు శ్రద్ధగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.

చట్ట సభల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలి

రాయికల్: చట్ట సభల్లో యాదవులకు ప్రాధాన్యత కల్పించాలని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ అన్నారు. శనివారం రాయికల్ మండలం మూటపల్లిలో యాదవ సంఘ సభ్యత్వ నమోదు చేపట్టి, ప్రాధాన్యత దక్కే వరకు పోరాటం చేస్తామన్నారు. సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం,న్యాయంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయాలు చర్చించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మ్యాదరవేని రామంజనేయులు యాదవ్, పంచతి శంకర్ యాదవ్, గోనే నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి స్పందన


మందుల పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బుగ్గారం: జానపద కళాకారుడు,గాయకుడు ఎస్వీ మల్లిక్ తేజ ఆధ్వర్యంలో వాస్విక్ ఫౌండేషన్ సహకారంతో మండలంలోని చిన్నాపూర్‌లో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి పర్యవేక్షణలో వివిధ విభాగాలకు చెందిన పలువురు వైద్యులు 300 మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.వీరిలో కొంతమందికి మెరుగైన వైద్యపరీక్షలు,ఆపరేషన్లు నిర్వహించడానికి నేడు హైద్రాబాద్‌కు తీసుకెళ్ళనున్నారు. వివిధ విభాగాలకు సంబంధించిన రోగులను 127 మందిని మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించిన గాయకుడు మల్లిక్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,తదితరులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు వేముల సుభాష్,ఎం.ఎం కిషన్‌రెడ్డి,నగునూరి నర్సాగౌడ్,జంగ శ్రీనివాస్,గడ్డం రమేష్,గట్టు గంగారాం,బుర్ర రమేష్, పంచాయతీ కార్యదర్శి సతీశ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పరిశీలన


రత్నాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న ఏఈ

మల్లాపూర్: మండల కేంద్రంలోని రత్నాపూర్‌లో శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులను పీఆర్ ఏఈ రాగసుధ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కాగా గ్రామంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న సీసీరోడ్డు వెంటనే నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

బుగ్గారం: మండలంలోని చందయ్యపల్లెలో కలమడుగు రాజు అనే వ్యక్తి ఇటీవల వ్యవసాయ బావిలో పడి దుర్మరణం చెందగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతుడి కటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపి, పదివేల రూపాయల ఆర్థికసాయం చేశారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: పట్టణంలోని టౌన్–2 సెక్షన్ పరిధిలోని రాజీవ్ చౌరస్తా, బైపాస్‌రోడ్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా, సీతారాంనగర్, విజయపురికాలనీ, విద్యానగర్, జాంబాగ్, మైసమ్మ గడ్డ, గొల్లపల్లిరోడ్, తాతమ్మగుడి, దయాల్‌నగర్, రఘురాములకోట, అశోక్‌నగర్, సత్యనారాయణటెంపుల్, రామాలయం టెంపుల్, ఎల్‌ఐసీ ఆఫీస్, ఓల్డ్ బస్టాండ్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సఫిద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మెట్‌పల్లి: పట్టణంలోని కళానగర్, రాంనగర్, సుల్తాన్‌పురా, ఆదర్శనగర్, దీన్‌దయాళ్‌నగర్, టీచర్స్ కాలనీ, కొత్త బస్టాండ్, దుబ్బవాడ, వెంకట్రావ్‌పేట, రత్నాలబాగు బాలకృష్ణనగర్, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

సారంగాపూర్ మండలంలో..

సారంగాపూర్: మండలంలోని సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30 గంటల నుండి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోరింటాకు సంబరాలు


గోరింటాకు వేడుకల్లో మహిళలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రాత్మక విషయాలు విద్యార్థులకు తెలియజేయడం కోసమే గోరింటాకు వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోరింటాకు ఒక సంప్రదాయమని ఎంఈవో చంద్రకళ అన్నారు. శనివారం స్థానిక ఓల్డ్ హైస్కూల్లో పీఆర్టీయూ జిల్లా శాఖ మహిళ విభాగం ఆధ్వర్యంలో ఆషాడమాసం గోరింటాకు ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ మండల ఎంఈవో గాయత్రి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అనిత, వసంతరాణి, రాష్ట్ర మహిళ అసోసియేట్ అధ్యక్షురాలు శశికళ, ఉపాధ్యక్షురాలు వసంత, చందన, అనిత, ప్రశాంతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భారతీ సాహిత్య సమితి సేవలు అభినందనీయం

కోరుట్ల రూరల్: భారతీ సాహిత్య సమితి సేవలు అభినందనీయమని శతావధాని ఆముదాల మురళి అన్నారు. పట్టణంలోని సినారే కళా భవన్ లో శనివారం సాయంత్రం వానమామలై వరదాచార్యుల స్మారక పురస్కారం, అందె వెంకటరాజం స్మరక పురస్కారం తో పాటు భారతీ సాహిత్య సమితీ అధ్యక్షుడు కంజర్ల రామాచార్య రచించిన పద్య పరిష్కృతి పుస్తకావిష్కరణ , కవి సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మపురి సంస్కృత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కొరిడె విశ్వనాత శర్మ పద్య పరిష్కృతి పై అభిప్రాయం వివరించారు.అనంతరం జరిగిన కవి సమ్మేళనం అలరించింది. ఈ కార్యక్రమంలో భారతీ సాహిత్య సమితీ ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి అందె రాజేంద్రప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శి రాజోజు భూమేశ్వర్,అందె శివప్రసాద్, చెన్నా విశ్వనాథం, రుద్ర మాణిక్యం, మాదవి, చంద్రం పాల్గొన్నారు.

పొలాసలో శ్రీకృష్ణ పారాయణం


పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ పారాయణం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పారాయణం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

యాగం లో అర్చకులు పాల్గొనాలి

కథలాపూర్: హైదరాబాద్‌లో ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే యాగంలో జిల్లాలోని అర్చకులు పాల్గొనాలని ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవచార్యులు కోరారు. శనివారం కథలాపూర్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రజలు, ప్రభుత్వం బాగుండాలని లోక కల్యాణార్థం పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని అర్చకులు హైదరాబాద్‌లో శ్రీ తుల్జాభవన్ ధర్మశాల వద్దకు వచ్చి విజయవంతం చేయాలన్నారు.

సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం


కోరుట్లలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోరుట్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం పట్ల శనివారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి

మెట్‌పల్లి: స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. పట్టణంలోని విదిత్‌రెడ్డి గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి వెండి, బంగారు వర్తక సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొని మాట్లాడారు. స్వర్ణకారులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి కలిగేలా చూస్తానన్నారు. ఆయన వెంట పలువురు పాల్గొన్నారు.

మల్లాపూర్ : 'బీసీ' లకు 42శాతం రిజర్వేషన్ల అమలుకై సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేక ఆర్డినెన్స్ నిర్ణయం చారిత్రాత్మకమని, సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని మరోసారి రుజువైందని కాంగ్రెస్ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం మల్లాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన సంబరాలు నిర్వహించారు. లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు పలుగ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత, వైస్‌చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్ నూతిపెల్లి రాజం, వనసంరక్షణ సమితి చైర్మన్ సిరిపురం రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే మూడు కొత్త పాఠశాలలు


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోరుట్ల: ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కృషితోనే కోరుట్ల నియోజకవర్గానికి మూడు కొత్త పాఠశాలలు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు.శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ విద్యాశాఖ సెక్రటరీ నవీన్ నికోలస్‌కు విజ్ఞప్తి చేయటంతో కోరుట్ల పట్టణంలోని మాదాపూర్ కాలని, మెట్‌పల్లి మండలంలోని మారుతీనగర్, మల్లాపూర్ మండలం ఒబులాపూర్ తండకు పాఠశాలలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. పాఠశాలల మంజూరుతో పాటు పలు అభివృద్ధి పనులకు బీఆర్‌ఎస్ రాజ్యసభ ఎంపీల నిదులు కూడా ఎమ్మెల్యే మంజూరు చేయిస్తూ కోరుట్ల నియోజక అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ నాయకులు భూపెల్లి నరేష్, మాజీ కౌన్సిలర్ రహీం పాషా, సంతోష్, కటుకం రవి, దువ్వ సత్యనారాయణ, రాజరెడ్డి, అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల: చొప్పదండి నియోజకవర్గంలోని ప్రతీ మండలంలో బీఆర్‌ఎస్ గులాబీ జెండా ఎగురవేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మల్యాల మండల స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలతో బూర్గుపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధిమాత్రమే కనపడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏదీ లేదని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీలత, పాక్స్ చైర్మన్లు బోయినపల్లి మధుసూదన్ రావు,అయిల్నేని సాగర్ రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడవిలా మైదానం



కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా.. కళాశాల ఆవరణ లో ఆట మైదానం అధ్వాన్న స్థితిలో కనిపిస్తోంది. పాఠశాల ప్రారంభంలోనే మైదానాన్ని పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆటలకు వీలు కల్పించాల్సి ఉన్నా, ఇప్పటి వరకు అధికారుల్లో చలనం లేదు. ప్రస్తుతం మైదానమంతా పిచ్చి మొక్కలు, చెత్త తో నిండిపోయి అడుగు పెట్టే పరిస్థితి లేదు. విద్యార్థులు ఆటలు ఆడేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కాలేజీ యాజమాన్యం, సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి మైదానం శుభ్రం చేయించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.